సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ꞏ 31 ꞏ డిసెంబర్ ꞏ 2024



పూసాయి జాతర ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పూసాయి ఎల్లమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



మిశ్రమ సాగు..లాభాలు బాగు

ఉమ్మడి జిల్లాలోని పలువురు రైతులు మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధిస్తూ లాభాల బాట పడుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపించనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

పైలెట్ ప్రాజెక్ట్ దక్కేనా..?



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి విక్రయానికి తీసుకొచ్చిన బండ్లు (ఫైల్)

- పత్తి విక్రయాల్లో 'పీడీపీఎస్' అమలుకు కేంద్రం యోచన
- ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ ఏఎంసీ పరిశీలన
- ప్రస్తుత సీజన్‌లోనే తీసుకొచ్చేందుకు యత్నాలు
- 'మద్దతు' దక్కకపోతే.. ధర లోపం రైతుకు చెల్లించేలా పథకం

సాక్షి,ఆదిలాబాద్: ప్రస్తుత కొనుగోళ్ల సీజన్‌లో పత్తి క్వింటాలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.7521. ప్రైవేట్‌లో మాత్రం రూ.7వేలు మించి రైతుకు దక్కడం లేదు. ఒకవేళ ఇప్పటికే పీడీపీఎస్ అమలులో ఉంటే ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయించిన రైతుకు ధర లోపం కింద మిగులు రూ.521 కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా చెల్లించేది. తద్వారా రైతుకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈ సీజన్‌లో ఆదిలాబాద్ ఏఎంసీలో ఈ పథకం ప్రయోగాత్మకంగా అమలవుతుందా.. లేదా చూడాల్సిందే.

ధర లోపం చెల్లింపు పథకం..

ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్ స్కీమ్ (పీడీపీఎస్) అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. పత్తి దిగుబడులను ప్రభుత్వ మార్కెట్ యార్డు ద్వారా ప్రైవేట్ వ్యాపారులకు రైతులు విక్రయించినప్పుడు ఎంఎస్‌పీతో పోల్చితే అక్కడ తక్కువ ధర లభించినప్పుడు ఆ లోపం ధరను కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా చెల్లించడమే ఈ పథకం ఉద్దేశం. దీన్ని రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సీజన్ నుంచే అంటే.. జనవరి నుంచే అమలు చేయాలని యోచిస్తున్నారు. సోమవారం వరంగల్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ అక్కడ నిర్వహించిన సమావేశంలో దీని పరిధిలోని జిల్లా మార్కెటింగ్ అధికారులు, కొన్ని పెద్ద పెద్ద మార్కెట్ యార్డుల సెక్రెటరీలు పాల్గొన్నారు. ప్రధానంగా జనవరి నుంచి ఈ స్కీమ్‌ను అమలు చేసే పరిస్థితి ఉందా.. లేదా అనే అంశంలో జాయింట్ డైరెక్టర్ చర్చించినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో మార్కెటింగ్ అధికారులు ఇప్పటికీ ఎలాంటి సమాచారాన్ని వెల్లడించలేదు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ పథకాన్ని తెలంగాణలోని ఆదిలాబాద్ ఏఎంసీలో అమలు చేయాలని సూచించినప్పటికీ ఈ సీజన్‌లో అమలు కష్టమని రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు కేంద్రానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన జారీ కాకపోవడంతో మార్కెటింగ్ అధికారులు ఇప్పుడే ఇలాంటి విషయాలు వెల్లడించడం లేదు.

కొత్త స్కీమ్ అమలైతే..

ప్రయోగాత్మకంగా కొత్త స్కీమ్‌ను ఆదిలాబాద్ ఏఎంసీలో అమలు చేసిన పక్షంలో పత్తి కొనుగోళ్ల పరంగా సీసీఐ నామమాత్రం అవుతుంది. వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తారు. మార్కెట్లో ఉన్న ధరను వారు చెల్లిస్తారు. ఆ ధర లోపాన్ని కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా చెల్లిస్తుంది. అయితే ఆదిలాబాద్ వంటి పెద్ద మార్కెట్లో ఇప్పటికిప్పుడే ప్రయోగాత్మకంగా అమలు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రతిరోజు వేలాది మంది రైతులు వేల క్వింటాళ్లను ఈ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో ఇప్పటికిప్పుడే దీన్ని అమలు చేస్తే విధాన పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటున్నట్లు తెలుస్తోంది.

అమలైతే రైతులకు ప్రయోజనం..



ధర లోపం చెల్లింపు పథకం అమలు చేయాలని గతం నుంచే ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అమలైతే మాత్రం రైతులకు ప్రయోజనం దక్కుతుంది. మార్కెట్లో లైసెన్స్‌డ్ ప్రైవేట్ వ్యాపారులే పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. అయితే అనుమతి లేకుండా జిల్లాలో అనేక మంది వ్యాపారులు పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈ స్కీమ్ అమలైతే ఇలాంటి వ్యాపారుల ద్వారా రైతుకు ధరలోపం దక్కే అవకాశం ఉండదు.

– బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

చిన్న మార్కెట్లో మొదట అమలు చేయాలి..



ఆదిలాబాద్ వంటి పెద్ద మార్కెట్లో ఇప్పటికిప్పుడే ప్రయోగాత్మకంగా ఈ స్కీమ్‌ను అమలు చేస్తే ఇబ్బంది ఎదురవుతుంది. ప్రధానంగా ఈ విధానంలో వ్యాపారులకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టడం జరిగింది. మొదట చిన్న మార్కెట్లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తే విధానపర లోపాలు దృష్టికి వస్తాయి. ఆ తర్వాత ఆదిలాబాద్ వంటి పెద్ద మార్కెట్లో ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

– రాజు చింతవార్, పత్తి వ్యాపారి, ఆదిలాబాద్

అర్జీల వెల్లువ

- ప్రజావాణికి 108 వినతులు
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



సమస్యలను వింటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ రాజర్షి షా వినతులను స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని అందుబాటులో ఉన్న అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కాగా, ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 108 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామాలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన.

బండరాళ్లను తొలగించండి



మాది భీంపూర్ మండలంలోని నిపానిగ్రామం. మా గ్రామానికి చెందిన 40 మంది రైతులకు 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అసైన్డ్‌భూములను పంపిణీ చేసింది. అయితే వాటిల్లో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండి పంటల సాగుకు ఇబ్బందికరంగా ఉంది. వాటిని తొలగించాలని ఆరేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకం కింద ఆ బండరాళ్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

పీఎం కిసాన్ నిధులు రావట్లేదు

మేమంతా జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దళిత రైతులం. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం మాకు దళితబస్తీ కింద మూడెకరాల చొప్పున భూములను పంపిణీ చేసింది. వాటిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అందించే రూ.6వేల ఆర్థిక సాయం అందడం లేదు. వ్యవసాయాధికారులను ఎన్నిసార్లు సంప్రదించినా పట్టించుకోవడం లేదు. ఆర్థికసాయంతో పాటు బోరు మోటార్లు కూడా అందించి ఆదుకోవాలని కోరుతున్నాం.



విద్యుత్ సౌకర్యం కల్పించండి



నా పేరు అసద్. మావల మండలంలోని సర్వేనంబర్ 170లో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం(2013)లో ఇందిరమ్మ ఫేజ్–3 కింద ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. గుడిసెలు వేసుకుని నాటి నుంచి అక్కడే జీవనం సాగిస్తున్నాం. ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. చిమ్మచీకట్లలో అవస్థలు పడుతూ కాలం వెల్లదీయాల్సి వస్తుంది. వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

కోర్టు ఆదేశించినా పోస్టింగ్ ఇవ్వట్లేదు



నాపేరు మలపతి స్వప్న. తాంసి మండలం పొన్నారి గ్రామం. 2018లో ప్రభుత్వం ప్రకటించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామక రాత పరీక్షలో మొదటి ర్యాంకు సాధించాను. అయితే దరఖాస్తు సమయంలో మహిళకు బదులుగా పురుషుడిగా పొరపాటు జరిగింది. ఈ కారణంతో నాకు పోస్టింగ్ నిలిపివేశారు. అప్పటి నుంచి జిల్లా పంచాయతీ అధికారుల చుట్టూ తిరిగినా స్పందించలేదు. విధిలేని పరిస్థితుల్లో ఈ ఏడాది అక్టోబర్‌లో హైకోర్టును ఆశ్రయించగా జనవరి 3లోగా నాకు పోస్టింగ్ కల్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాలను సైతం పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. విచారణ జరిపించి జేపీఎస్‌గా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నా.

సమగ్ర ఉద్యోగులపై సీఎం వైఖరి సరికాదు

- ఎంపీ గోడం నగేశ్

కైలాస్‌నగర్: సమగ్ర శిక్ష ఉద్యోగులపై సీఎం రేవంత్ రెడ్డి ప్రదర్శిస్తున్న మొండివైఖరి సరికాదని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట గల సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులను నిర్లక్ష్యం చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంబిస్తుండటం విచారకరమన్నారు. విద్య అనేది ఉమ్మడి జాబితా అయినా రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్‌కు సంబంధించిన అంశాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే తప్పకుండా స్పందిస్తుందన్నారు. రెండు రోజుల్లో ఉద్యోగుల సమస్యలపై కేంద్ర విద్యాశాఖ మంత్రికి మెయిల్ చేస్తానని భరోసానిచ్చారు. శిబిరం నుంచే రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ వారి సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, సంఘం ప్రతినిధులు ఉన్నారు.

న్యూస్‌రీల్

3న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాక

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు హైకోర్టు జడ్జి డా.షమీమ్ అక్తర్‌తో నియమించిన ఏకసభ్య కమిషన్ జనవరి 3న ఆదిలాబాద్ జిల్లాకు రానున్నట్లుగా జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. 2న సాయంత్రం 5గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 8గంటలకు జిల్లా కేంద్రంలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుని బస చేస్తారని పేర్కొన్నారు. 3న ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణపై వినతులను స్వీకరిస్తారని తెలిపారు. సబ్ కులాల వారీగా స్థితిగతులను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్

ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్ నియామకం అయ్యారు. ఇందుకు సంబంధించి డీజీపీ జితేందర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం ఉట్నూర్ డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ నాగేందర్ బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా ఏఎస్పీ కాజల్ 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు.

'నూతన' వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో పేర్కొన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా 30చోట్ల ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం గస్తీ, పెట్రోలింగ్ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండేలా చూస్తున్నామని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. థర్టీ ఫస్ట్ వేడుకలను రాత్రి 12.30 గంటల వరకు పూర్తి చేసుకోవాలని, ఆ తర్వాత నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అలాగే డీజేలు, అధిక శబ్దాలు చేసే సౌండ్ సిస్టంలకు అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలో మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయించవద్దని తెలిపారు. వేడుకల సందర్భంగా ఏవైనా కార్యక్రమాలు నిర్వహిస్తే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వణికించిన పులి, ఏనుగు

- తొలిసారిగా ఏనుగు దాడిలో ఇద్దరి మృతి
- పులి దాడిలో మరొకరు..
- రెండు పులులు కూడా మరణం
- ఈ ఏడాదిలోనూ వన్యప్రాణులు, మనుషులకు ఘర్షణ



గత ఏప్రిల్‌లో సంచరించిన ఏనుగు

రివైండ్ 2024

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది వన్యప్రాణులు అలజడి రేపాయి. ఏటా చలికాలంలో పులుల సంచారం ఉన్నప్పటికీ ఈ సంవత్సరం మరింత ఎక్కువగా కనిపించా యి. రెండేళ్ల తర్వాత గత నెలలో కాగజ్‌నగర్ మండలం గన్నారానికి చెందిన మోర్లే లక్ష్మిని పత్తి చేనులోనే దాడి చేసి చంపేయగా, సిర్పూర్(టీ) పరిధి దుబ్బగూడలో రైతు సురేశ్‌పై దాడిచేసింది. అయితే ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఇక రైతుల పశువులు, మేకల మందలపైనా దాడులు చేస్తున్నా యి. దీంతో అటవీ సమీపప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకు కునుకు లేకుండా పోతోంది. రోడ్లు దాటు తూ, జన సంచారం ఉన్న చోటు వరకు పులులు, చిరుతలు కనిపిస్తున్నాయి. గడిచిన ఏడాదిలోనూ మనుషులు, వన్యప్రాణులకు ఘర్షణ కొనసాగింది.

వలస పులులతో భయం

ఈ ఏడాది పొడవునా మహారాష్ట్ర నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వులోకి పులులు రాకపోకలు సాగించాయి. ఇందులో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల వరకు ఓ మగపులి, సిర్పూర్(టీ) మీదుగా మరోపులి, ఆసిఫాబాద్ జిల్లాలో మరో పులి సంచరించింది. వీటిలో రెండు మగవి, కాగా ఒకటి ఆడపులి ఉంది. ప్రస్తుతం రెండు వలస పులులు సంచరిస్తున్నాయి. మరోవైపు ఇద్దరిపై దాడిచేసి పులి మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో సంచరిస్తోంది. ఆదిలాబాద్ నుంచి మొదలై జన్నారం వరకు పులులు సంచరించాయి. దీంతో ఆయా చోట్ల ఉన్న స్థానికులు బెంబేలెత్తారు.

తొలిసారిగాఏనుగు రాక

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఓ ఏనుగు ఉమ్మడి జిల్లాకు వచ్చింది. మూడు రోజుల పాటు సంచరిస్తూ అలజడి రేపింది. ఇద్దరిపై దాడి చేసి చంపేసింది. గత ఏప్రిల్‌లో 25నుంచి 30ఏళ్ల వయస్సు మగ ఏనుగు చింతలమానేపల్లి మండలం బూరెపల్లిలో మిరపతోటలో రైతు శంకర్‌ను చంపేసింది. మరుసటి రోజే పెంచికల్‌పేట మండలం కొండపల్లిలో కారు పోశన్నపై దాడిచేసి చంపేసింది. దీంతో స్థానికులు చేన్లలోకి వెళ్లాలంటే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. చివరకు మురళి గూడ సమీపంలో ప్రాణహిత దాటి మహారాష్ట్ర వైపు వెళ్లిపోవడంతో అంతాఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు భవిష్యత్తులోనూ ఏనుగులు వచ్చే అవకాశం ఉన్నట్లు ముందస్తుగా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికను సైతం అటవీశాఖ సిద్ధం చేసుకుంది.

రెండు పులుల మరణం



సర్కెపల్లి, దరిగాం అడవుల్లో చనిపోయిన పులి

మరోవైపు ఈ ఏడాదిలోనే రెండు పులులు మరణించాయి. ఐదారేళ్ల వయస్సున్న మగపులి (ఎస్ 9)ని విషమిచ్చి చంపారు. గత జనవరిలో కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ దరిగాం, సర్కెపల్లి మధ్య బూడిద మామిడి అడవుల్లో ఏడాదిన్నర ఆడపులి, అదే నెల 8న ఐదారేళ్ల మగపులుల కళేబరాలను గుర్తించారు. ఈరెండింటిలో ఆడపులి మాత్రం మరోపులితో పోరులో చనిపోగా, మగపులి మాత్రం విషంతో చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ రెండు పులల మరణంతో అటు అటవీ అధికారులపై చర్యలతోపాటు పలువురు రైతులపైనా కేసులు నమోదయ్యాయి. అంతేకాక మరోసారి ఎవరూ పులు లకు ముప్పు కలిగించకుండా, పశువులు, మ నుషులపై దాడి చేస్తే పరిహారం పెంచడంతో పాటు 24 గంటల్లోనే చెల్లించేలాఏర్పాటు చేశారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకట్


ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆదిమూలం వెంకట్ ఎన్నికయ్యారు. నల్గొండలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంఘం రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యులతో పాటు జిల్లా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎన్నికల హామీలు అమలుపర్చాలి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పట్టభద్రులు 14,586.. ఉపాధ్యాయులు 1,561

- 'మండలి' ఓటర్ల తుది జాబితా విడుదల
- రెవెన్యూ కార్యాలయాల్లో ప్రదర్శన
- భారీగా దరఖాస్తుల తిరస్కరణ



తాంసి తహసీల్దార్ కార్యాలయంలో జాబితాను ప్రదర్శిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కైలాస్‌నగర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓటరు తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సోమవారం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు 14,586 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటర్లు 1561 మంది నమోదైనట్లుగా వెల్లడించారు. ఈ ఓటర్ల జాబితాలను కలెక్టర్ కార్యాలయంతో పాటు ఉట్నూర్ సబ్ కలెక్టర్, ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోల వద్ద కూడా అందుబాటులో ఉంచనున్నట్లుగా వెల్లడించారు.

పెరిగిన పట్టభద్రుల ఓటర్లు..

2019లో జరిగిన శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. ఓటరు నమోదుపై అధికారులు విస్తృత ప్రచారం కల్పించడం, ఓటు నమోదు చేసుకునేందుకు ఈసీ పలుమార్లు అవకాశం కల్పించడం కలిసొచ్చింది. గతంతో పోల్చితే పట్టభద్రుల ఓటర్లు రెట్టింపుగా నమోదు చేసుకున్నారు. నాటి ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లు 7,268 మంది ఉండగా ప్రస్తుతం 14,586 మంది ఉన్నారు. గతంతో పోల్చితే 7,318 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 10,104 మంది పురుష ఓటర్లు, 4,482 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్యలో పెద్దగా మార్పేమి కనిపించ లేదు. నాటి ఎన్నికల్లో 1,554 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 1,561 మంది ఉన్నారు. కేవలం ఏడుగురు మాత్రమే ఈ సారి పెరిగారు. మొత్తంగా 1,073 మంది పురుష ఓటర్లు, 488మంది మహిళా ఓటర్లు ఉన్నారు. సాధారణ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉండగా మండలి ఎన్నికలకు వచ్చేసరికి పురుషులదే ఆధిక్యం కనిపిస్తోంది.

1,982 దరఖాస్తుల తిరస్కరణ

శాసన మండలి ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకునే వారంతా విద్యావంతులే. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఇందుకు అర్హులే. అలాంటి విద్యావంతుల దరఖాస్తులు జిల్లాలో భారీగా తిరస్కరణకు గురవడం విస్మయానికి గురిచేస్తోంది.పట్టభద్రుల ఓటర్లకోసం 16,197 మొత్తం దరఖాస్తులు అందగా, 14,586 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. మరో 1,611 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే టీచర్స్ ఓటర్లకోసం 1,932దరఖాస్తులురాగా 1,561 ఆమోదం పొందాయి. 371 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అయితే దరఖాస్తు విధానంపై అవగాహన లేకపోవడం, దరఖాస్తు సమయంలో పూర్తి వివరాలు నింపకపోవడం, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జత చేయకపోవడం, సెల్‌ఫోన్ నంబర్లు, అడ్రస్ వంటి వివరాలు తప్పుగా నమోదు చేయడం వంటి కారణాలతోనే ఈ దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లుగా అధికారులు చెబుతున్నారు.

రెవెన్యూ డివిజన్	పట్టభద్రుల ఓటర్లు			ఉపాధ్యాయ ఓటర్లు		
	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
ఉట్నూర్	1,441	608	2,049	169	76	245
ఆదిలాబాద్	8,663	3,874	12,537	904	412	1,316

క్లుప్తంగా

యోగా పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో రామకృష్ణాపూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఎం.రాజకొమురయ్య ప్రతిభ కనబర్చాడు. 60 నుంచి 70 ఏళ్ల విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడు. స్థానిక క్రీడాకారులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రెటరీ బాబురావు తెలిపారు. ట్రిపుల్ జంప్‌లో బి.విష్ణు (ఎంజేపీ, లక్సెట్టిపేట), 1500 మీటర్ల పరుగుపందెంలో ప్రకాశ్ (ఎంజేపీ, చెన్నూర్), ఆరు కిలోమీటర్ల క్రాస్ కంట్రీలో జే.దీపక్ (ఎంజేపీ, గుడిపేట్) ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

పసికందు మృతిపై ఆందోళన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రెండు రోజులకు శిశువు మృతి చెందడంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పాతబెల్లంపల్లికి చెందిన గర్భిణి గందం గంగవ్వ ఈనెల 24న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. చిన్నారిని సమీపంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో చేర్పించి నాలుగు రోజులపాటు చికిత్స అందించారు. ఈ నెల 28న సాయంత్రం డిశ్చార్జి చేశారు. ఆదివారం రాత్రి మృతి చెందింది. వైద్యులు సరైన చికిత్స ఇవ్వకపోవడంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. సీఐ ప్రమోద్‌రావు, ఎస్సైలు ప్రవీణ్, వినీత సంఘటనా స్థలానికి చేరుకుని కేసు పెడితే దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. సదరు ఆస్పత్రి వైద్యుడిని వివరణ కోరగా డిశ్చార్జి చేసిన 48 గంటల తరువాత పాప మృతి చెందిందని, తమ వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాండూర్: మండల కేంద్రానికి చెందిన ఇందారపు సురేష్ (39) ఆదివారం రాత్రి రైల్వే సబ్‌స్టేషన్ సమీపంలో కూలి పనికి వెళ్లాడు. విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మృతుని భార్య ఇందారపు శారద అలియాస్ రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిశ్రమ సాగు.. లాభాలు బాగు



ఈ చిత్రంలో కనిపిస్తోంది సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన కొండ రవి అనే రైతు సాగుచేసిన ఆయిల్ పాం తోట. అందులో అంతర పంటను పరిశీలిస్తున్న అధికారులు సోన్ మండల వ్యవసాయ శాఖకు చెందిన ఏఈవోలు. రైతులు మొక్కజొన్న, సోయా, వేరుశనగ, శనగ, పెసర, బొబ్బర్లు వంటి పంటలు సాగు చేయడం సహజం. కానీ ఈ రైతు మాత్రం అందరికీ భిన్నంగా ఆయిల్‌పాం పంటలో అంతరపంటగా వానాకాలంలో వరి సాగుచేసి అధిక దిగుబడి సాధించాడు. దీంతో యాసంగిలో కూడా వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాడు.


చామన్‌పెల్లి వద్ద ఆయిల్‌పాం తోటలో సాగవుతున్న మొక్కజొన్న

- ఆయిల్‌పాం తోటలో అంతర పంటలు సాగు
- లాభాలు గడిస్తున్న రైతులు
- నిర్మల్ జిల్లాలో 8,500 ఎకరాల్లో సాగు

లక్ష్మణచాంద(నిర్మల్): అన్నదాతలు పురాతన పద్ధతిలో పంటలు సాగు చేసి నష్టాలబాట పడుతున్న నేటి తరుణంలో నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల రైతులు అందరికీ భిన్నంగా మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలబాట పడుతున్నారు. సదరు రైతులు సాగులో సాధిస్తున్న సక్సెస్‌పై 'సాక్షి' అందిస్తున్న కథనం.

8,500 ఎకరాల్లో సాగు

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల పరిధిలో 8500 ఎకరాల్లో పామాయిల్ సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. సాధారణంగా ఆయిల్‌పాం సాగులో ఐదేళ్ల వరకు పంట దిగుబడి ప్రారంభం కాదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వివిధ మండలాల్లోని పలువురు యువరైతులు ఆయిల్‌పాంలో అంతర పంటగా వివిధ రకాల పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

- సోన్ మండలంలోని చింతల్‌చాంద గ్రామానికి చెందిన యువరైతు నాగభూషణ్ మిశ్రమ వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఆయిల్‌పాం తోటలో తైవాన్ జామతో పాటు, మొక్కజొన్న వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం పంట పండింది

వేమనపల్లి(బెల్లంపల్లి): ప్రాణహిత వరద ముంపుతో నిండా మునిగిన రైతులు అధైర్య పడకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసి కొంత ఉపశమనం పొందుతున్నారు. ఈ ఏడాది జులై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నది రెండుసార్లు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన వేమనపల్లి, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కళ్లంపల్లి, కేతన్‌పల్లి, కల్మలపేట, ముల్కలపేట, రాచర్ల గ్రామ శివారులోని సుమారు 2,500 ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో సైతం రైతులు భారీగా నష్టపోయారు. వరుసగా రెండుసార్లు వరద ముంచెత్తడంతో ముంపు భూముల్లో వేరే పంట సాగు చేయలేక భూములు బీళ్లుగా ఉండిపోయాయి. దీంతో కౌలు, పెట్టుబడి ఖర్చులు భారం కాగా వర్షాలు తగ్గుముఖం పట్టాక ఏదో ఒక పంట సాగు చేయాలని అనుకున్నారు.


ఆశాజనకంగా ఉన్న పత్తి చేను

50 ఎకరాల్లో పత్తి

మండలంలో ప్రాణహిత లోతట్టు ప్రాంతాల్లోని నీటి వసతి ఉన్న ఎనిమిది మంది రైతులు సుమారు 50 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. మిగతా భూముల్లోని రైతులు జొన్న, పెసర, నువ్వులు లాంటి ఆరుతడి పంటలు సాగు చేశారు. వర్షాకాలం పంట మునిగి నష్టం చవిచూసిన ముంపు రైతులు ఆలస్యంగానైనా పంట సాగు చేయాలనుకున్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఆలస్యంగా అక్టోబర్‌లో పత్తి, ఇతర పంటలు సాగు చేశారు.

అధిక లాభాలు



నాకున్న రెండెకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశా. అందులో అంతర పంటగా తైవాన్ జామతో పాటు పెసరి పంటలు సాగు చేస్తున్నా. అంతర పంటలతో అధిక లాభాలు ఉన్నాయి. – పెంటన్న, రైతు, రాచాపూర్

మంచి దిగుబడి వచ్చింది



నాకున్న మూడున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశా. అందులో అంతర పంటలుగా వానాకాలం నువ్వు, మొక్కజొన్న వేశా. మంచి దిగుబడి రావడంతో యాసంగిలో వేరుశనగ సాగు చేశా. – కేశం శ్రీనివాస్, రైతు, మల్లాపూర్

అంతర పంటలతో ఆదాయం



ఆయిల్‌పాంలో అంతర పంటలు సాగుచేస్తే మంచి ఆదాయం వస్తుంది. జిల్లాలోని పలువురు రైతులు అంతర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మిగతా రైతులు కూడా ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలి. – వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

- సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన ఎల్చల్ గంగారెడ్డి అనే యువరైతు 14 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాడు. అందులో అంతర పంటలుగా పసుపు, మొక్కజొన్న, కంది పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు.
- లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన రైతు ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాడు. అందులో అంతర పంటలుగా తైవాన్ జామ, వాటర్ ఆపిల్, బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాడు.

దుబాయ్ వెళ్లాలని... ముంబైలో దారితప్పి..

- ఉపాధి కోసం వెళ్లిన జిల్లావాసి అదృశ్యం

నిర్మల్‌ఖిల్లా: అనునిత్యం గల్ఫ్‌దేశాల్లో వివిధ కారణాలతో జిల్లావాసుల మరణ మృదంగం కొనసాగుతున్నా.. ఉపాధి వలసలు మాత్రం ఆగడం లేదు. ఇదే కోవలో జిల్లాకు చెందిన ఒకరు నాలుగు నెలల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయ్ వెళ్లాలని ముంబై చేరుకుని అక్కడ దారితప్పగా ఇప్పటికీ ఆచూకీ లభ్యం కానీ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లికి చెందిన తంబాకు శ్రీనివాస్ (39) కుటుంబ పోషణ కోసం ఉన్న ఊరిలో అప్పుల పాలు కావడంతో ఉపాధికోసం దుబాయ్ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. గల్ఫ్ ఏజెంటును ఆశ్రయించాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సదరు ఏజెంటు రూ.75వేలు తీసుకొని ముంబైలోని ట్రావెల్ ఏజెన్సీ సర్వీసెస్ సహాయంతో ఆగస్టు 5న విమాన టికెట్ బుక్ చేశాడు. ఆగస్టు 3న ఆర్మూర్ నుంచి ముంబైకి బస్సులో బయలుదేరిన శ్రీనివాస్ 4న అక్కడికి చేరుకున్నట్లు భార్య లక్ష్మి కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఇప్పటి వరకు అతను ఎక్కడికి వెళ్లిందీ.. ఏం చేస్తున్నాడన్న సమాచారం లేదు. ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ వస్తుండడంతో సదరు ఏజెన్సీ ఏజెంట్‌ను పదేపదే అడుగగా బోర్డింగ్ అయిన తర్వాత ఫ్లైట్ ఎక్కకుండా ఉంటే తాము చేయగలిగిందేమీ లేదని స్పష్టం చేయడంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. సోమవారం శ్రీనివాస్ భార్య లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల, కలెక్టర్, జిల్లా పోలీస్ అధికారి కార్యాలయాల్లో వేరువేరుగా ఫిర్యాదు చేస్తూ తన భర్త ఆచూకీ కనుగొనాలని వేడుకున్నారు. గత నాలుగు నెలలుగా తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వందల కోట్లు ఖర్చు.. లక్షల కోట్లు దోపిడీ

- ప్రజాశాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రాన్ని గతంలో పాలించిన మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు రూ.వందల కోట్లు ఖర్చు చేసి రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ప్రజాశాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ఆయన మావల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాజామాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులను గతంలోని కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్ సర్కారు చెల్లించడం లేదన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు మద్దతు పలికి బలపర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను కేసీఆర్ ఆయన వ్యాఖ్యల ద్వారా రెచ్చగొట్టారని మండిపడ్డారు. 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం పదవులు దక్కడం లేదని, 5 శాతం ఉన్న రెడ్లు, రావులు మాత్రం సీఎం, మంత్రి పదవుల్లో కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలం చెందారన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ 61వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామానికి చెందిన కరడే నాందేవ్ ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా రాంపూర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాందేవ్ కుమారుడు పాపేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

పత్తి వాహనం బోల్తా


కడెం వాగులో బోల్తా పడిన వాహనం

పెంబి: పత్తిలోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం (డీసీఎం) బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హరిచంద్‌తాండకు చెందిన రాజేశ్వర్ ఐచర్‌లో పత్తి నింపి కడెం వాగులోంచి తీసుకెళ్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. రైతు వాగులో దూకడంతో ప్రమాదం తప్పింది. కాగా వాహనం నీటి గుంతలో పడటంతో పత్తి సగానికి పైగా తడిసిపోయింది. రెండు జేసీబీల సాయంతో వాహనాన్ని పక్కకు తీసి తడవని పత్తిని వేరే ఐచర్‌లో వేసి తీసుకెళ్లారు.

వంతెన ఉంటే ప్రమాదం జరిగేది కాదు

కడెం వాగుపై పస్పుల వద్ద మూడేళ్ల క్రితం నిర్మించిన వంతెన కడెం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మరమ్మతులు చేపట్టి ఉంటే ఈ ప్రమాదం తప్పేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లాకు చెందిన వాగేవార్ గౌతమ్(27)పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 17న భర్తతో గొడవపడి నిర్మల్‌కు వచ్చిన ఓ మహిళను సాయం చేస్తానని నమ్మించి గౌతమ్ నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఓ లాడ్జిలో ఆమెకు ఇష్టం లేకుండా శారీరకంగా లొంగదీసుకుని, నిర్మల్‌లో వదిలిపెట్టాడు. స్పృహ తప్పి పడి ఉన్న ఆమెను గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రవీంద్రనగర్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న నరాల రాజేశ్వర్, సిరిచెల్మలో బెల్ట్‌షాపు నిర్వాహకుడు శ్రీనివాస్‌పై సోమవారం కేసు నమోదు చేసి రూ.10 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికార్ అహ్మద్ తెలిపారు. వీరిద్దరు కొన్ని రోజులుగా సిరికొండ మండల కేంద్రంలో వైన్స్ నుంచి మద్యాన్ని తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీకి పాల్పడుతున్న ముగ్గురిపై..

లక్ష్మణచాంద: దొంగతనం చేస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడిన సంఘటన మండలంలోని చింతల్‌చాంద సమీపంలో చోటు చేసుకుంది. తిర్పెల్లికి చెందిన సుంచు వినయ్, దేశవోయిన సుకుమార్, శివరాత్రి భూమేష్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. సోమవారం ఉదయం చింతల్‌చాందకు చెందిన రైతు నక్కల అన్వేష్ గ్రామ శివారులో వరి ధాన్యం సంచులలో నింపి ఉంచగా వాటిని ఎత్తుకునేందుకు ప్రయత్నించారు. అటుగా వస్తున్న గ్రామస్తులు వారిని చూసి పట్టుకున్నారు. నక్కల అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

ఎనిమిది మందిపై ..

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.దేవయ్య తెలిపారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లి బజారు ఏరియా యూనియన్ బ్యాంకు లైన్‌లో ఉన్న ఓ సెలూన్ షాప్‌కు ఆదినారాయణ వెళ్లడంతో రాగంశెట్టి సతీష్, కొత్తపల్లి శ్యామ్‌తో పాటు మరో ఆరుగురు వ్యక్తులు సామూహికంగా దాడి చేశారని తెలిపారు.

ఒకరి రిమాండ్

చింతలమానెపల్లి: అటవీభూమి సాగు చేస్తున్నాడని మండలంలోని దిందా గ్రామానికి చెందిన ఆత్రం భీంరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దిందా సెక్షన్ అధికారి మోహన్ తెలిపారు. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బందెపల్లి బీట్ 179 కంపార్ట్‌మెంట్‌లో అటవీభూమిని ఆత్రం భీంరావు ఆక్రమించుకున్నాడు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి


పెద్ద భీమన్న (ఫైల్)

ఖానాపూర్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు మస్కాపూర్ గ్రామానికి చెందిన ఒడ్నాల పెద్ద భీమన్న (64)కు గంగాయిపేట్‌లో వ్యవసాయ పంటపొలం ఉంది. అందులో కూరగాయలు సాగు చేశాడు. కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు జియా వైరుకు సోలార్ కనెక్షన్ ఇచ్చాడు. ఎప్పటిలాగే సోమవారం సైతం పంట చేనుకు వెళ్లగా జియా వైర్ (ఇనుప తీగ) కు కాలుతగలడంతో షాక్‌కు గురై కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సైదారావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జంగుబాయి ఉత్సవాలు విజయవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల ఆరాధ్య దైవం రాయితాడ్ జంగుబాయి ఉత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం హైదరాబాద్ ప్రజా భవన్‌లో జంగుబాయి దేవస్థానం నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవనరి 2న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరంధోళి గ్రామంలో ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ శ్యాంరావు, గౌరవ అధ్యక్షుడు జాకు, సలహాదారులు మరప బాజీరావు, భూమేశ్, నాగు, రామారావు కటోడ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మండలంలోని పెర్కగూడ, పిట్లగూడ, చీమనాయక్‌తాండ, వడోని, కుమ్మరితాండ, తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యూం, మాజీ సర్పంచ్ జగదీశ్, లింగన్న, మల్లుబాయి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం సిద్దం గ్రామానికి చెందిన లక్ష్మీబాయి త్రిఫేస్, బోర్‌వెల్ మంజూరు చేయాలని, నార్నూర్ మండలానికి చెందిన కిరణ్ కుమార్ కారులోన్ ఇప్పించాలని, ఉట్నూర్ మండలం మారుతిగూడకు చెందిన రుక్మాబాయి బోరింగ్ రిపేర్ చేయించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ ఉమాదేవి, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు లాడ్జీల యజమానులపై కేసు


మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

బాసర: బాసరలోని ప్రైవేటు లాడ్జీల యజమానులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన లాడ్జి ఓనర్‌తో పాటు లీజుకు తీసుకున్న మరో లాడ్జి ఓనర్‌పై పోక్సో చట్టం కింద ఒకటి హైదరాబాద్‌లో, బాసరలో మరొకటి వేర్వేరుగా కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న ప్రైవేటు లాడ్జీలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, అద్దె గదులను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులకు అద్దెకు ఇవ్వవద్దని లాడ్జి యజమానులకు సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే లాడ్జి యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు..


సాయిచరణ్ (ఫైల్)

నేరడిగొండ: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బుద్దికొండకు చెందిన సింగం లక్ష్మణ్ కుమారుడు సాయిచరణ్ (23) ఈనెల 25న తన స్నేహితుడి పుట్టినరోజు సంబరాలను ఊరుబయట ఉన్న పోచమ్మ ఆలయం వద్ద జరుపుకోగా అక్కడ ఉన్న హైమాస్ లైట్లను యువకులు పగులగొట్టారు. దీంతో గ్రామ పెద్దలతో పాటు గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ సదరు యువకులను పిలిపించి ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలని సూచించారు. కాగా ఆదివారం రాత్రి సాయిచరణ్ బయటకు వెళ్లివస్తానని చెప్పి గ్రామ శివారులో గల పంట పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడి మృతికి గ్రామస్తులే కారణమని, పోలీసు స్టేషన్‌కు పిలిపించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు రహదారిపై బైటాయించారు. మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిమోనియాతో చిన్నారి..

ఇంద్రవెల్లి: నిమోనియాతో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని హర్కపూర్ ఆంధ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్‌కు చెందిన కుడే సంతోశ్, పూజ దంపతుల కుమార్తె సీతాల్ (రెండు నెలలు) వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మూడురోజుల క్రితం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించగా చిన్నారి నిమోనియాతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటిలేటర్‌లో ఉంచి చికిత్స అందించినా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.